నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని మణికొండ ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 వరకు అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 1, 3 నుంచి 13 వరకు, సెక్టార్ 2ఎ, 2బి, 2సి, ఆదిత్యా ఫోర్ట్ విల్లాస్, కాశీ విశ్వేశ్వరాలయం ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్ ప్రాంతంలోని ప్రధాన రహదారిపై రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న నిర్మాణాన్ని అడ్డుకోవాలని మంగళవారం స్థానికులు ఉప కమిషనర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రధాన రహదారి నుంచి బస్తీలోకి వెళ్లేందుకు గతంలో 10 ఫీట్ల రోడ్డును ఏర్పాటు చేశారని ఈ రోడ్డులో డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ ఉందన్నారు. ప్రస్తుతం ఈ రోడ్డును ఆక్రమిస్తూ నిర్మాణాన్ని చేపడుతున్నారని ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

శంషాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని అసైన్డ్ భూముల్లోని అక్రమ నిర్మాణాలును రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. పట్టణ పరిధిలోని గొల్లపల్లి కుర్దు సర్వే నంబరు 210, 220, 221లో అసైన్డు భూములో ఇటీవల గృహ నిర్మాణాలు చేపట్టి వాటికి ఇంటి నెంబర్లు తీసుకుని రిజిస్ట్రేషన్ చేసి విక్రయిస్తున్న తీరుపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ విషయమై తహసీల్దార్ రవీందర్‌దత్ ఆదేశాల మేరకు మంగళవారం ఆర్‌ఐ కృష్ణ తదితర సిబ్బంది అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. అసైన్డు భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని హెచ్చరించారు.

సరుకుల పంపిణీ

గచ్చిబౌలి: అనాథ పిల్లలకు టీజీఎస్‌ఎస్‌పీ కొండాపూర్ బెటాలియన్ పోలీసులు సరుకులను పంపిణీ చేశారు. మంగళవారం బి కంపెనీ యాన్యువల్ రిఫ్రెషర్స్ కోర్స్‌లో భాగంగా మోతీనగర్‌లోని శ్రీ ఆదర్శ ఫౌండేషన్‌ను సందర్శించారు. అసిస్టెంట్ కమాండెంట్ సీతారాం చేతుల మీదుగా దుస్తులు, రైస్ బ్యాగ్, ఫ్రూట్స్ అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రేమ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ట్రెక్కింగ్



రాయదుర్గం: హెచ్‌సీయూ క్యాంపస్‌లో విద్యార్థులు 'మౌంటేన్ ట్రెక్కింగ్' నిర్వహించారు. అఖిల భారత విద్యార్థి పరిషత్, స్టూడెంట్స్ ఫర్ డెవలప్‌మెంట్(ఎస్‌ఎఫ్‌డీ) సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు హైరాక్స్ వరకు వెళ్లారు. అక్కడి కొద్దిసేపు సేద తీరారు. ఈ సందర్భంగా ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు.

7న కార్పొరేట్ ఇన్నోవేషన్ కాంక్లేవ్-2025

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన కార్పొరేట్ ఇన్నోవేషన్ కాంక్లేవ్(సీఐసీ-2025) నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, అతిథులుగా సైయింట్ సంస్థ బోర్డు డైరెక్టర్, వ్యవస్థాపక చైర్మన్ బీవీఆర్ మోహన్ రెడ్డి, యూనికార్న్ వ్యవస్థాపకుడు రోహిత్ చెన్నమనేని, దొడ్ల డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్‌రెడ్డి, వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారు. కార్యక్రమంలో 300కు పైగా కార్పొరేట్ ప్రతినిధులు, 100కు పైగా స్టార్టప్‌లు, 100కు పైగా ఎకోసిస్టమ్ భాగస్వాములు పాల్గొంటారు. ఈ సందర్భంగా స్టార్టప్‌లకు రూ.1,200 కోట్లను ఫండింగ్ చేసే అవకాశం ఉంది.

తయారీ సామర్థ్యం.. ఎగుమతులతో ఆర్థికవృద్ధి

రాయదుర్గం: దేశంలో తయారీ సామర్థ్యం, ఎగుమతులు పెంచడం, ఎంఎస్‌ఎంఈలను బలోపేతం చేయడం ద్వారానే ఆర్థికవృద్ధి సాధ్యమని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ నర్సింహుగారి తేజ్ లోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐలో 'మేక్ ఇన్ ఇండియా'పై డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ విభాగం ఆధ్వర్యంలో జాతీయస్థాయి విద్యా, శిక్షణ సంస్థల వెబినార్‌లో దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత్‌ను తయారీ కేంద్రంగా మార్చడంలో ఎఫ్‌డీడీఐలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. దేశీయంగా ఉండే చర్మకారులకు ఇతర సంస్థల సహకారంతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ ఫ్యాకల్టీ, అధికారులు పాల్గొన్నారు.



కాలనీ వీధిలో వెలుగని లైట్లు



చిమ్మ చీకటిలో కాలనీ ప్రధాన రహదారి

చీకటిమయం..
దొంగల భయం

వెలగని హైమాస్ట్ లైట్లు | రెచ్చిపోతున్న దొంగలు | స్పందించని అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రధాన రహదారుల్లో హైమాస్ట్ లైట్లు, కాలనీలు, బస్తీల్లో వీధి దీపాలు వెలుగకపోవడంతో అంధకారం నెలకొని ప్రయాణాలు ప్రమాదకరంగా మారాయి. ప్రధాన రోడ్డు కావడంతో చీకటిలో వచ్చే వాహనాలకు దారి కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇదే అదనుగా భావించి దొంగలు కూడా రెచ్చిపోతున్నారు. ఆ రహదారి గుండా వెళ్లాలంటే వాహనదారులు, పాదచారులు జంకుతున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధి లక్ష్మిగూడ నుంచి ఏయిర్‌పోర్టు వెళ్లే ప్రధాన రహదారి, మధుబన్ కాలనీ, బాబుల్‌రెడ్డినగర్, టీఎన్జీవోస్ కాలనీ, కాటేదాన్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు. నెలలు గడుస్తున్నా వాటిని పట్టించుకునే నాథుడే లేడని ఆయా ప్రాంతాల వారు వాపోతున్నారు.

ఫిర్యాదు చేసినా..

ప్రధాన రాహదారులతో పాటు కాలనీలలోని అంతర్గత రోడ్లపై కూడా వీధి దీపాలు వెలుగకపోవడంతో దొంగలకు అనుకూలంగా మారుతుంది.కొన్ని చోట్ల బైకులు,ఆటోలు, లారీలలో బ్యాటరీ లను ఎత్తుకెళ్తున్నారు. పలు ఇళ్లలోకి దూరి సైకిళ్లు, ఏది దొరికితే అది దోచుకెళ్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉదయాన్నే పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు వచ్చి సీసీ కెమెరాలు చూస్తున్నారు. అందులో చీకటి ఉండడంతో ఏం చేయాలని దుస్థితి నెలకొంది. దొంగలు చీకటి ఉన్న ప్రధాన రహదారులు,అంతర్గత రోడ్లను దృష్టిలో ఉంచుకొని దొంగతనాలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీధి దీపాలు, హైమాక్స్ లైట్లకు మరమ్మతు చేయాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



రాత్రి సమయంలో ప్రయాణించాలంటే లైట్లు తప్పనిసరి. చీకటి రోడ్లపై రాకపోకలు సాగించాలంటే భయంగా ఉంటుంది. చీకటి దారుల్లో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై ఉన్న హైమాస్ట్ లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలి.

– మహేష్, స్థానిక నాయకుడు

సమస్యను పరిష్కరిస్తాం

గత ప్రభుత్వ హయాంలో ఎలక్ట్రికల్ వీధి లైట్లు ఓ సంస్థకు కాంట్రాక్ట్ ఇచ్చారు. ఇప్పుడు వారు సరిగ్గా చేయడం లేదు. రెండు నెలల్లో కాంట్రాక్ట్ గడువు ముగిస్తోంది. త్వరలోనే అన్ని కాలనీల్లో వీధి లైట్లు, రోడ్లకు ఇరువైపులా ఉన్న హైమాస్ట్ లైట్లు వెలిగేలా చర్యలు చేపడుతాం.

– రామారావు, డీఈ



మధుబన్ కాలనీ చౌరస్తాలో..



ఎయిర్‌పోర్టుకు వెళ్లే రహదారిలో కమ్ముకున్న చీకటి

క్రీడలతో శారీరక దారుఢ్యం

మైలార్‌దేవ్‌పల్లి: క్రీడలతో శారీరక దారుఢ్యం పెరుగుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి క్రికెట్ లీగ్‌లో భాగంగా మంగళవారం విజేతలకు ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించాలన్నారు. రాజేంద్రనగర్ నియోజవర్గప్రజలు, యువతకు తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. విన్నర్‌గా నిలిచిన జై హనుమాన్ టీమ్, రన్నర్‌గా నిలిచిన కాటేదాన్ టీమ్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, రాముయాదవ్, సోమ శ్రీనివాస్ గుప్తా, అశోక్‌కుమార్, సోమ సందీప్‌గుప్తా, శివ, పవన్, రాఘవేంద్రయాదవ్, మైసిరెడ్డి,



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కార్తీక్‌రెడ్డి

గుమ్మడి కుమార్, రాజు, అరుణ్‌ముదిరాజ్, సురేష్, వెంకటరమణ, భాస్కర్, మల్లేష్‌యాదవ్, రామకృష్ణ, అనిల్, సునీల్, సింహాద్రి పాల్గొన్నారు.

ఇంజనీర్లు అద్భుతాలను సృష్టించారు

- 'ఎస్కీ' డైరెక్టర్ డా.రామేశ్వరరావు
- 'ఎస్కీ' ప్రాంగణంలో ప్రపంచ ఇంజనీరింగ్ దినోత్సవం



సమావేశంలో పాల్గొన్న ఎస్కీ డైరెక్టర్ రామేశ్వరావు

రాయదుర్గం: ప్రతి దేశం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలంటే ఇంజనీర్ల పాత్ర కీలకమని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు అన్నారు. ప్రపంచ ఇంజనీరింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఎస్కీ' ప్రాంగణంలో ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషికి అవసరమైన స్వచ్ఛ నీరు, సమర్థవంతమైన రవాణా, మౌలిక వసతుల పరిష్కారాలకు యువ ఇంజనీర్లు కృషి చేయాలన్నారు. వేల సంవత్సరాల ఈజిప్ట్ పిరమిడ్స్‌తో సహా వేలాది అద్భుతాలను ప్రపంచ వ్యాప్తంగా ఇంజనీర్లు సృష్టించారని ఆయన గుర్తు చేశారు. ఇంజనీర్లు, అధికారులు జి నరేష్, అనిత అగర్వాల్, డాక్టర్ సాగర్, సాయికిశోర్, సిహెచ్ తిలక్, శ్రీకాంత్, జ్యోతి, సౌమ్య, మోహన్, డాక్టర్ మోహన్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఇంజనీర్లు అమర్‌నాథ్, శ్రీధర్‌బాబు, డాక్టర్ కృష్ణమోహన్‌రావు, రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ చంద్రకళ, డా. రాజారావు పాల్గొన్నారు.

టీఎన్‌జీఓ కాలనీలో సెంట్రల్ లైటింగ్ ప్రారంభం



కాలనీలో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: టీఎన్‌జీఓ కాలనీలో ప్రధానరోడ్డుపై రూ.44.59 లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను సోమవారం రాత్రి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ రాత్రివేళ రోడ్లపై వాహనదారులు ఇబ్బందిపడకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ మల్లికార్జున్, డీఈ కవిత, సూపర్‌వైజర్ మహేష్‌రెడ్డి, రాజు, పవన్, నాయకులు, టీఎన్‌జీఓ కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలి

శేరిలింగంపల్లి: ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఉమా దీపిక తెలిపారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీలో ఆశాలు, ఏఎన్ఎంలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ స్వామి, పీహెచ్‌ఎన్ శ్యామల, ఎస్ఎస్‌కే మేనేజర్ మంజుల, ఫీల్డ్ వర్కర్ అఖిల తదితరులు పాల్గొన్నారు.



రేపు దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

శంషాబాద్: ఆర్టిఫిషియల్ లింబ్ మనుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో వయోవృద్ధులు, దివ్యాంగులకు ఉపకరణాలు అందజేయనున్నట్లు మహేశ్వరం సీడీపీఓ శాంతిశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. శంషాబాద్ పట్టణంలోని మహిళామండలి భవనంలో గురువారం ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. దివ్యాంగులు వికలాంగుల ధ్రువీకరణ పత్రం (కనీసం 40శాతం) ఉండాలన్నారు. దాంతో పాటు ఆదాయ ధ్రువీకరణ లేదా బీపీఎల్ కార్డుతో పాటు ప్రతి లబ్ధిదారులు ఆధార్ కార్డును తీసుకురావాలన్నారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



కొత్తగూడ జంక్షన్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గోనె సురేష్

గచ్చిబౌలి: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఆటోలను నిలపాలని గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గోనె సురేష్ సూచించారు. మంగళవారం కొత్తగూడ, గచ్చిబౌలి జంక్షన్లలో ఆటోడ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటో, డ్రైవర్ వివరాలను తెలియజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆటో నంబర్ అన్ని వైపుల నుంచి కనిపించేలా పెట్టాలన్నారు. ఆటో డ్రైవర్లు డ్రెస్ కోడ్‌ను పాటించాలని, రోడ్డు పక్కన మాత్రమే ఆటోలను నిలపాలని సూచించారు. బస్టాప్‌లు, రోడ్లపై ఆటోలను నిలిపితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలని ఆయన కోరారు.

దేవిక మృతదేహం అప్పగింత

గచ్చిబౌలి: వరకట్న వేధింపులతో పెళ్లైన ఆరు నెలలకే తనువు చాలించిన కమలాపురం దేవిక(25) మృతదేహానికి మంగళవారం ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వికారాబాద్ జిల్లా తోర్‌మామిడిలో దేవిక అంత్యక్రియలు చేశారు. కాగా దేవిక తోటి ఉద్యోగి సద్గుర్తి శరత్ చంద్రను ప్రేమించింది. పెద్దల అంగీకారంతో గోవాలో పెళ్లి చేసుకొని రాయదుర్గంలోని ప్రశాంత్‌హిల్స్‌లో కాపురం పెట్టారు. ఐదు లక్షల నగదు, 10 తులాల బంగారం కట్నంగా ఇచ్చానని తల్లి రామ లక్ష్మీ పేర్కొంది. అదనపు కట్నం విషయంలో గొడవలు తారాస్థాయికి చేరడంతో మనస్తాపానికి గురైన దేవిక ఆత్మహత్య చేసుకుంది. దేవిక తరచుగా రీల్స్ చేస్తుంటుందని, ఇన్‌స్టాగ్రాంలో మూడు లక్షలకు పైగా ఫాలోవర్స్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు సద్గుర్తి శరత్ చంద్రను అరెస్ట్ చేస్తామని ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



ట్రోఫీ అందజేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే విజ్ఞానవంతులుగా ఎదుగుతారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మహవీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా గత రెండు రోజుల నుంచి జరిగిన క్రీడా పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఈటల హాజరై మాట్లాడారు. మహవీర్ కళాశాల విద్యతో పాటు క్రీడాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 35 ఇంజినీరింగ్ కళాశాలల పాల్గొని తమ క్రీడాస్ఫూర్తిని నింపాయన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు సామా రంగారెడ్డిలతో కలిసి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎస్.జయలక్ష్మి, జాయింట్ సెక్రటరీ ఎస్.ధనుంజయ్‌రెడ్డి, అగ్నిహోత్రి, ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఉషశ్రీ, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు.

దార్శనిక నాయకురాలు అహల్యాబాయి



మాట్లాడుతున్న శైలజ

మణికొండ: లోకమాత దేవి అహల్యాబాయి హోల్కర్ దార్శనిక నాయకురాలని, ఆమె రాణిగా ఉన్న సమయంలో మాల్వా రాజ్యాన్ని జ్ఞానం, న్యాయం, శాంతి, శ్రేయస్సు, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలించారని జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. శైలజ అన్నారు. మంగళవారం నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగుల పల్లిలోని శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఆమె 300వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఆమె పాలనలో ఆలయాలు పునర్‌నిర్మించడం, రోడ్లు, బావుల నిర్మాణం చేపట్టి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆమె ప్రజలకు నిజమైన సేవ చేయాలని నమ్మిన సిద్ధాంతం కోసం కృషి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.నర్మద, కోఆర్డినేటర్‌లు మల్లీశ్వరి, సృజన, కన్వీనర్‌లు డాక్టర్ బి.నరేంద్రకుమార్, డాక్టర్ ఎ.రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సులేమాన్‌నగర్‌లో అగ్నిప్రమాదం



ఎగిసిపడుతున్న మంటలు



ప్రమాదంలో తగలబడిపోయిన ఆటో

అత్తాపూర్: సోఫాలు తయారు చేసే దుకాణంలో మంటలు అంటుకున్న ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు వివరాల ప్రకారం.. మహమ్మద్ గౌస్ సులేమాన్‌నగర్‌లో అద్దె షట్టర్‌లో సోఫాలు తయారు చేస్తూ విక్రయిస్తున్నాడు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో మంటలు అంటుకుని సోఫాలన్నీ కాలిపోయాయి. సమీపంలో పార్క్ చేసి ఉన్న ఆటో పాక్షికంగా దెబ్బతింది. విద్యుదాఘాతంలోనే అగ్ని ప్రమాదం సంభవించినట్లు అనుమానిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బీజేపీ సంబరాలు



మిఠాయిలు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు



సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

అత్తాపూర్: రోజురోజుకు బీజేపీకి ప్రజల ఆదరణ పెరుగుతుందని చేవెళ్ల బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందిన సందర్భంగా మంగళవారం అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ చౌరస్తాలో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, కొమురయ్య, విజయ్‌కుమార్, జయానంద్ రెడ్డి, జగన్, రాజు పైల్వాన్, వెంకట్‌రెడ్డి, అనురాధ, అమృత, శశికాంత్‌శర్మ, జిత్తుసింగ్, బి.సతీష్, విజయ్, స్వామి, సందీప్, ఎస్.శ్రీను, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో..

రాజేంద్రనగర్: బీజేపీ అభ్యర్థుల విజయంతో రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జి.బాబురావు ఆధ్వర్యంలో మంగళవారం అంబేడ్కర్ చౌరస్తాలో మిఠాయిలు పంచి సంబురాలు చేసుకున్నారు. ఈ రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ వై.శ్రీధర్, మక్తల్ అసెంబ్లీ ఇన్‌చార్జి బొక్క బాల్‌రెడ్డి, దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరని సదానందం, నాయకులు కోరని క్రాంతి, పులిమామిడి రవీంద్ర, డాక్టర్ శ్రీరామ పాల్గొన్నారు.

టీఎన్‌జీఓస్ కాలనీలో 14 భవనాలు సీజ్



గచ్చిబౌలి: నిబంధనలు పాటించకుండా అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు నిర్మించిన భవనాలను శేరిలింగంపల్లి టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేస్తున్నారు. టీఎన్‌జీఓస్ కాలనీలో అక్రమంగా నిర్మించిన 14 భవనాలను మంగళవారం సీజ్ చేశారు. శేరిలింగంపల్లి సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ వెంకటరమణ ఆధ్వర్యంలో గచ్చిబౌలి ఎస్ఐ శివపాల్ రెడ్డి , సిబ్బంది బందోబస్తు మధ్య భవనాలను సీజ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు నివాసం ఉండే టీఎన్‌జీఓస్ కాలనీలో రెండు లేదా ముడు అంతస్తులకు అనుమతి తీసుకొని ఆరు, ఏడు అంతస్తులు నిర్మించడం గమనార్హం. పలుమార్లు అధికారులు హెచ్చరిస్తూ నోటీసులు జారీ చేసినా భవన యజమానులు పట్టించుకోకపోవడంతో 461/ఎఫ్ జీహెచ్‌ఎంసీ యాక్ట్-1955 ప్రకారం భవనాలను సీజ్ చేసినట్లు ఏసీపీ వెంకటరమణ తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

- మత గురువు ఆచార్య దేవ్ మురారిబాపూజీ



ధ్వజారోహణ కార్యక్రమంలో ఆచార్య దేవ్ మురారిబాపూజీ

రాయదుర్గం: ప్రపంచంలో ప్రస్తుతం అలజడి, అశాంతి వ్యాప్తి చెంది ఉన్నాయని ఉత్తరప్రదేశ్ మధురా బృందావనం ప్రపంచ విఖ్యాత మత గురువు, అంతర్జాతీయ ధర్మాచార్య ఆచార్య దేవ్ మురారి బాపూజీ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం శివ పరమాత్మ ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మనుషులలో వెలితి ఎక్కువ అవుతోందని, ఆధ్యాత్మిక చింతన, జీవన సరళిలో మార్పు దీనికి సరైన పరిష్కార మార్గమని సూచించారు. బ్రహ్మకుమారీస్ సేవలు, బోధనలు ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. శివపరమాత్మ జ్ఞానం అందరినీ కాపాడుతుందన్నారు. నేటి ప్రపంచంలో అందరూ ఆధ్యాత్మికతవైపు మొగ్గుచూపాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సంస్థల హైదరాబాద్ శాఖల ఇన్‌చార్జి రాజయోగిని బికె కుల్‌దీప్ దీదీ, ప్రతినిధులు బికె అంజలి, మౌంట్ అబూ ప్రతినిధులు చంద్రేశ్, శ్రీకాంత్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.